ప్రజాశక్తి

మంగళవారం 10 అక్టోబర్ 2023 5 అనంతపురం



పరిహారం చెల్లించాకే రహదారి విస్తరణ పనులు చేపట్టాలి



ఆర్‌డిఒతో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

భూ నిర్వాసితులకు పరిహారం చెల్లించిన తర్వాతే 544-డి జాతీయ రహదారి విస్తరణ పనులు చేపట్టాలని 544డి రోడ్డు నిర్వాసితుల సంఘం జిల్లా కన్వీనర్ వి.శివారెడ్డి, అధ్యక్షులు నాగరాజు, రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆర్‌డిఓ మధుసూదన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 544-డి రోడ్డు నిర్మాణం కోసం బుక్కరాయసముద్రం మండలం రోటరీపురం నుంచి బుగ్గ వరకూ దాదాపు 500 ఇళ్లు కోల్పోతున్నారన్నారు. అయితే వారికి నష్టపరిహారం ఇవ్వకపోయినా పనులు మొదలు పెట్టారన్నారు. కావున ఇంటి స్థలం, ఇళ్లు కేటాయించిన తర్వాత పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు.



ప్రత్యామ్నాయమూ అరకొరే..!

◆ సబ్సిడీ విత్తనాలు కొనేందుకు ఆసక్తి చూపని రైతులు

◆ 20 శాతం కూడా కొనుగోళ్లు లేవు..

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపైనా పెద్దగా ఆసక్తి చూపుతున్న దాఖలాల్లేవు. 80 శాతం సబ్సిడీతో ప్రభుత్వం విత్తన పంపిణీ చేపడుతున్నా తీసుకోవడానికి రైతులు ముందుకు రావడం లేదు. ఇక ఖరీఫ్ సీజన్ సమయం కూడా ముగియడంతో ఈసారి పంటల సాగు ఖరీఫ్ అయిపోయినట్టుగా కనిపిస్తోంది. జిల్లా సాధారణ సాగు 9.96 లక్షల ఎకరాలవుతే 7.04 లక్షల ఎకరాల్లోనే పంటల సాగయ్యాయి. 2.92 లక్షల ఎకరాలు ఇప్పటికీ బీడుగా ఉంది.

20 శాతం కూడా పోని ప్రత్యామ్నాయ విత్తనాలు

జిల్లాలో ఖరీఫ్ సీజన్ కీలక సమయమైన ఆగస్టు నెలలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో రైతులు సాధారణ పంటలను సాగు చేయలేకపోయారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో ప్రత్యామ్నాయ విత్తనాలు ఉలవలు, పెసలు, అలసందలు, కొర్రలు పంపిణీ చేపట్టింది. రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకుంటే 80 శాతం సబ్సిడీతో వీటిని అందజేస్తామని ప్రకటించింది. ఈ మేరకు జిల్లాలో 16 వేల క్వింటాళ్లను రైతు భరోసా కేంద్రాల్లో నిలువ చేశారు. 10,328 మంది రైతులు విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇప్పటి వరకు 3226 క్వింటాళ్లను తీసుకున్నారు. మొత్తం పంపిణీ చేపట్టిన దానిలో 20 శాతం కూడా విత్తనాన్ని రైతులు తీసుకోలేదు.

23 శాతం బీడే

అనంతపురం జిల్లాలో 9.96 లక్షల ఎకరాలు సాధారణ సాగయితే, 7.04 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. సాధారణ సాగులో 77 శాతం మాత్రమే అయింది. తక్కిన 23 శాతం బీడుగానే ఉంది. జొన్న, సజ్జ వంటి పంటల సాగు కొంత వరకు పెరిగినా పూర్తి స్థాయిలో సాగు విస్తీర్ణం పెరగలేదు. జొన్న సాధారణం కంటే కొద్దిగా అధికంగా సాగైంది. 17 వేల ఎకరాల్లో విత్తనం వేశారు. సజ్జ 3400 ఎకరాలకుగానూ 5614 ఎకరాల్లో అయింది. సాధారణం కంటే 168 శాతం సాగైంది. చిరుధాన్యాలు 4091 ఎకరాల సాధారణ సాగయితే 4746 ఎకరాల్లో సాగైంది. సాధారణం కంటే కొద్దిగా పెరిగింది. ఇలా ప్రత్యామ్నాయ పంటల సాగు కూడా ఆశించినంత పెరుగుదల లేదు.

ఇప్పటికీ వర్షాభావమే

అనంతపురం జిల్లాలో ఇప్పటికీ వర్షాభావ పరిస్థితులే నెలకొన్నాయి. ఇప్పటి వరకు 366 మిల్లీమీటర్లు వర్షపాతం పడాల్సి ఉండగా 249 మిల్లీమీటర్లు మాత్రమే పడింది. 32 శాతం లోటు వర్షపాతం నమోదయింది. 24 మండలాల్లో వర్షాభావం నెలకొనగా, శెట్టూరులో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. 321 మిల్లీమీటర్లు సాధారణ వర్షపాతం నమోదవ్వాల్సి ఉండగా 127 మిల్లిమీటర్లు మాత్రమే పడింది. ఆరు మండలాల్లో మాత్రం సాధారణ వర్షపాతం నమోదు అయ్యింది.

విద్యుత్ ఛార్జీల పెంపును ప్రతిఘటిద్దాం

◆ దోపిడీదారిన ప్రజలపై సర్దుబాటు భారం

◆ కార్పొరేట్‌ల సేవలో సామాన్యుల నడ్డివిరుస్తున్న ప్రభుత్వాలు

◆ విద్యుత్ భారాలపై వామపక్షాల ఆధ్వర్యంలో ప్రచారం



విద్యుత్ భారాలపై ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ప్రజలపై భారం మోపేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించిన విద్యుత్ ఛార్జీల పెంపుదలను విద్యుత్ వినియోగదారులందరూ సమిష్టిగా ప్రతిఘటించాలని వామపక్ష పార్టీల నేతలు పిలుపునిచ్చారు. విద్యుత్ ఛార్జీలు పెంపుదల, ప్రజలపై భారాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యుత్ విధానాలపై వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో సోమవారం నాడు అనంతపురంలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. పాతూరు బ్రహ్మంగారి దేవాలయం నుంచి మొదలైన ప్రచారాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్ హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాతూరు మార్కెట్, నీలంటాకీస్ సర్కిల్ వద్ద ప్రజలు, దుకాణదారులను కలిసి విద్యుత్ భారాల వల్ల కలిగే నష్టాలను తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలను పెంచి ప్రభుత్వాలు ప్రజలపై భారాలు మోపుతున్నాయని తెలిపారు. ఒకేసారి సర్దుబాటు పేరుతో మూడు సార్లు విద్యుత్ ఛార్జీలను పెంపుదల చేసిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కై ప్రజలకు విద్యుత్ షాక్ ఇస్తున్నాయని విమర్శించారు. గత సంవత్సరం రూ.1400 కోట్లు భారం మోపగా, తాజాగా రూ.6 వేల కోట్లు భారం వేశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు సంవత్సరాల్లో రూ.25 వేల కోట్లు ప్రజల నెత్తిన విద్యుత్ భారాలు మోపారన్నారు. ఈ నెల బిల్లులో 2014 సంవత్సరంలో వినియోగించిన విద్యుత్‌కు యూనిట్‌పై రూ.20 పైసలు, 2021 మే నెలలో వినియోగించిన విద్యుత్‌కు యూనిట్‌కు రూ.20 పైసలు, 2023 ఏప్రిల్ నెలలో వినియోగించిన విద్యుత్‌కు యూనిట్ 40 పైసలు కలిపి మొత్తం యూనిట్‌కు 80 పైసలు చొప్పున ప్రజలపై భారాలు మోపారని విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆదేశాలకు లొంగిపోయిన జగన్ ప్రభుత్వం ప్రతి నెలా వంట గ్యాస్ లాగానే విద్యుత్ ఛార్జీలను పెంచుతూ ప్రజలపై భారాలు మోపడం దుర్మార్గమైన చర్య అన్నారు. విద్యుత్ బిల్లులే కాకుండా ఫిక్స్ ఛార్జీలు, కస్టమర్స్, సర్ ఛార్జీలు, విద్యుత్ సుంకం, సర్దుబాటు ఛార్జీలు ఇలా రకరకాల పేర్లతో భారాలను మోపడమే పనిగా రాష్ట్ర ప్రభుత్వం పెట్టుకుందన్నారు. విద్యుత్ రంగాన్ని అదానీ వంటి కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని చెప్పారు. విదేశాల బొగ్గు సరఫరా చేసేది, బొగ్గు రవాణా చేసే ఓడరేవులు అదానీవే అన్నారు. ఇప్పుడు తాజాగా స్మార్ట్ మీటర్లు తయారు చేసే కంపెనీని అదానీ ప్రారంభించారంటే ఆయన గుప్పిట్లోకి విద్యుత్ రంగం ఎలా వెళ్తోందో అర్థం చేసుకోవచ్చన్నారు. రూ.3కు కొనుగోలు చేయాల్సిన విద్యుత్‌ను బహిరంగ మార్కెట్‌లో రూ.10 నుంచి రూ.20 వెచ్చించి కొనుగోలు చేయడం దగా చేసేందుకే అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్‌ల లోపు విద్యుత్ వినియోగించే వారందరికీ ఉచిత విద్యుత్ అంటూ హామీ ఇచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ ఉచిత విద్యుత్ పథకాన్ని క్రమంగా నీరుగారుస్తున్నారని విమర్శించారు. స్మార్ట్ మీటర్‌లు బిగించి ప్రజలపై స్మార్ట్‌గా భారాలు మోపేందుకు ప్రభుత్వం సిద్ధమైందన్నారు. గతంలో టిడిపి ప్రభుత్వం ప్రపంచ బ్యాంక్ ఆదేశాలకు లొంగి విద్యుత్ రంగాన్ని మూడు ముక్కలు చేసి సంస్కరణ పేరుతో ఛార్జీలు పెంచితే ప్రజలు తిరగబడ్డారని గుర్తు చేశారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం కళ్లుతెరిచి విద్యుత్ భారాలను తగ్గించకుంటే ఆయన కూడా ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు వై.వెంకటనారాయణ, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జున, సిపిఎం నగర కమిటీ నాయకులు వలీ, రాజు, జీవా, వెంకటేష్, గఫూర్, నాగభూషణ, బాబా, నారాయణ, ఆవాజ్ ఇస్మాయిల్, ప్రజానాట్య మండలి శీనా, రాముడు, ముసలప్ప, ఎన్టీఆర్ శీనా, సిపిఐ నగర కార్యదర్శి శ్రీరాములు, ఇన్సాఫ్ నాయకులు బంగారు బాషా పాల్గొన్నారు.

నిజాలు నిగ్గు తేలేనా..

తాగునీటి కార్మికుల నిధుల అక్రమాలపై నేడు విచారణ



పంచాయతీరాజ్ పర్యవేక్షణ ఇంజినీర్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు (పాతచిత్రం)

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో నీలకంఠాపురం శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకంలో కార్మికులకు దక్కాల్సిన నిధుల్లో చోటు చేసుకున్న అవినీతి, అక్రమాలపై మంగళవారం విచారణ చేపట్టనున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తాగునీటి సరఫరా పనులు చేపట్టిన కాంట్రాక్టర్ కలాంనాయుడు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. దీనిపై కార్మిక సంఘాలు, కార్మికుల పక్షాన పెద్దఎత్తున పోరాటాలు కొనసాగించారు. ప్రధానంగా సిఐటియు కార్మిక సంఘం మొదటి నుంచి పోరాటాలు చేసింది. చేసిన పనులకు వేతనాలు ఇవ్వాలని రోడ్డెక్కి ధర్నాలు, నిరసనలు తెలియజేయడంతోపాటు అధికారులు, ప్రజాప్రతినిధులకు విజ్ఞాపన పత్రాలు అందజేసి వినూత్న పద్ధతుల్లో ఆందోళనలు చేపట్టింది. ఈ పథకంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో 800 పైబడి కార్మికులు పని చేస్తున్నారు. వేతనాల కోసం నిరంతరం పోరాటాలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇఎస్ఐ, పిఎఫ్ నెలల తరబడి కార్మికుల ఖాతాల్లో జమ కాని పరిస్థితి. వేతనాలు చెల్లించాలని నిత్యం ఆందోళనలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కార్మికుల పేర్లతో నిధులను కాంట్రాక్టర్ కాజేసినట్లు గుర్తించిన సిఐటియు నాయకత్వం అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. మొత్తం 120 మంది కార్మికులంటూ ఒక్కొక్కరికి నెలకు రూ.15 వేలు చెల్లించినట్లు చూపించి మూడేళ్లపాటు నిధులు డ్రా చేసినట్లు కార్మిక సంఘం అధికారులకు విన్నవించింది. ఇస్తున్న వేతనాల్లో కూడా రూ.2500 చొప్పున కోతలు విధించి వేతనాలు చెల్లించినట్లు కార్మికులు, సిఐటియు నాయకులు అధికారులకు ఫిర్యాదులు చేశారు. అయితే విచారణ చేసిన అధికారులు కేవలం 19 మంది బోగస్ పేర్లతో వేతనాలు పొందినట్లు తేల్చారు. దీనిపై కార్మిక సంఘం వ్యతిరేకత తెలిపింది. సమగ్ర విచారణ జరపాలని కలెక్టరేట్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ కార్యాలయం వద్ద ధర్నాలు నిర్వహించారు. ఇదే విషయాన్ని పలు మీడియా పత్రికల్లో కాంట్రాక్టర్ అవినీతిపై కథనాలు ప్రచురించాయి. దీంతో స్పందించిన కలెక్టర్ ఎం.గౌతమి కార్మికుల నిధుల దుర్వినియోగం సమగ్ర విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశిస్తూ విచారణ అధికారిగా ఆన్‌సెట్ సిఇఒ కేశవనాయుడు నియమించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ అధికారులు ఇండోర్ స్టేడియంలో కార్మికులు, కార్మిక సంఘాలతో మంగళవారం వివరాలు సేకరించనున్నారు. నిజా నిజాలు నిగ్గు తేల్చాలని కార్మిక సంఘాలు పట్టుపడుతున్న నేపథ్యంలో వాస్తవాలు వెలుగులోకి వస్తాయని కార్మికులు ఆశిస్తున్నారు.

గడువులోపు అర్జీలకు పరిష్కారం

కలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వివిధ సమస్యలపై ప్రజలు అందించే జగనన్నకు చెబుదాం, స్పందన గ్రీవెన్స్ అర్జీలను నిర్దేశిత గడువులోపే పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ గౌతమి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో జగనన్నకు చెబుదాం, స్పందన గ్రీవెన్స్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, డిఆర్ఒ గాయత్రిదేవి, ఆర్డీవో మధుసూదన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, ఆన్‌సెట్ సిఇఒ కేశవనాయుడులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం, స్పందన అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలన్నారు. ఆర్జీలను నిత్యం పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు ఎలాంటి పెండింగ్ లేకుండా పరిష్కారం చూపించేలా సంబంధిత అధికారులు దృష్టి సారించాలన్నారు. రెవెన్యూ, సర్వే, పిఆర్, డిపిఒ, హౌసింగ్ శాఖల పరిధిలో ఎక్కువగా అర్జీలు వస్తున్నాయని, ఆయా శాఖల పరిధిలో నాణ్యతగా అర్జీలకు పరిష్కారం చూపించాలన్నారు. అర్జీదారుల్లో సంతృప్తి స్థాయి పెంచేలా ప్రతిరోజూ ఫీడ్ బ్యాక్ అందిస్తూ పంచాయతీ రాజ్ ఎస్ఈ, పోలీస్, వ్యవసాయ శాఖలు బాగా పని చేస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఒ ప్రశాంత్ కుమార్, డీఆర్డీడీఏ పీడీ నరసింహారెడ్డి, డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి, డీపీవో ప్రభాకర్ రావు, ఇన్‌ఛార్జి డిఇఒ నాగరాజు, సోషల్ వెల్ఫేర్ జెడి మధుసూదన్ రావు, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్రతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అర్జీలదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఎమ్.గౌతమి



రిజిస్ట్రార్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

వయోజన దూరవిద్య కోర్సులు కొనసాగించండి

ఎస్‌కెయు వద్ద విద్యార్థిసంఘాల ఆందోళన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో అడల్ట్ ఎడ్యుకేషన్ కోర్సును ఎత్తివేయాలని తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకుని, దానిని యథావిధిగా కొనసాగించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. వయోజన దూర విద్య కోర్సును కొనసాగించాలని, యూనివర్సిటీలో ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఉదయం ఎస్‌కెయు ఎడి బిల్డింగ్ ముందు ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, ఎఐఎస్ఎ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వి.జాన్సన్ బాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, ఎఐఎస్ఎ రాష్ట్ర అధ్యక్షులు వేమన, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమణయ్య కుళ్లాయిస్వామి మాట్లాడుతూ యూనివర్సిటీలో ఎంఎ అడల్ట్ ఎడ్యుకేషన్ కోర్సును మూసివేయడానికి రంగం సిద్ధం అయ్యిందన్నారు. గ్రామీణ పేద విద్యార్థులు ఉన్నత విద్యను అందించడంతోపాటు ఎంతో మంది విద్యార్థులను ఉన్నత స్థాయిలో నిలిపిన ఘనత ఎస్‌కెయుకు ఉందన్నారు. ఇటీవల అధికారులు, పాలకుల నిర్లక్ష్యం కారణంగా యూనివర్సిటీ ప్రతిష్ట తగ్గుతోందన్నారు. ఒక్కొక్క విభాగాన్ని మూసి వేస్తూ విద్యార్థులను విద్యకు దూరం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనివర్సిటీలో ఎంఎ అడల్ట్ ఎడ్యుకేషన్ కోర్స్ మూసివేయాలని యూనివర్సిటీ అధికారులే రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాయడం దుర్మార్గమైన చర్య అన్నారు. కోర్సులను పెంచాల్సింది పోయి, ఉన్న వాటిని తొలగించడం ఏమిటని ప్రశ్నించారు. యూనివర్సిటీలో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు లేరనే సాకుతో కోర్సులు మూసివేయాలని తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. ప్రొఫెసర్లు లేకపోతే వాటికి భర్తీ చేయాలని కానీ, ఇలా కోర్సులు తీసేయడం సరికాదన్నారు. యూనివర్సిటీని అభివద్ధి చేయడానికి వైస్ ఛాన్సలర్ ఉన్నారో.. లేక ఉన్న కోర్సులను తొలగించేందుకు ఆయన ఉన్నారో అర్థం కాని పరిస్థితి నెలకొందన్నారు. కోర్సులను ఎత్తేలా నిర్ణయాలు తీసుకుంటున్న ఎస్‌కెయు విసి రామకృష్ణారెడ్డిని రీకాల్ చేయాలని డిమాండ్ చేశారు. కోర్సులు ఎత్తివేయాలని చూస్తే వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. త్వరలో యూనివర్సిటీ సమస్యలపైన రాష్ట్ర గవర్నర్‌ను కలుస్తామని చెప్పారు. అనంతరం రిజిస్ట్రార్ లక్ష్మయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు రమేష్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి హనుమంతు, ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు ఉమా మహేష్, వంశీ, రజిని తదితరులు పాల్గొన్నారు.

మేధావులపై దాడులను వ్యతిరేకించాలి

మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సమాజంలో జరుగుతున్న అన్యాయాలను ఎత్తిచూపుతూ ప్రమాదాలపై చైతన్యం నింపుతున్న మేధావులపై పోలీసుల వ్యవస్థను అడ్డుపెట్టుకుని పాలకులు చేస్తున్న దాడులను వ్యతిరేకించాల్సిన అవసరం ఉందని రాజ్యాంగ పరిరక్షణ వేదిక కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ సోమవారం ఒక ప్రకటనలో అన్నారు. దేశంలోని మేధావులు, మీడియా ప్రతినిధులు, రచయితలపై వివిధ రూపాల్లో ఇబ్బందులకు గురయ్యే దుస్థితి నెలకొందన్నారు. కేంద్ర ప్రభుత్వం పోలీసు సంస్థలు ప్రశ్నించే మేధావులపై కేసులు పెట్టి భయాందోళనలకు గురి చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రశ్నించడమే తప్పుగా చూడటం అన్యాయంగా ఉందన్నారు. రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛను హరించే దుస్థితి దేశంలో కొనసాగుతోందన్నారు. సమాజానికి నిస్వార్థ సేవలు అందిస్తున్న రిటైర్డ్ ప్రిన్సిపల్, మానవ హక్కుల వేదిక తెలుగు రాష్ట్రాల కన్వీనర్ చంద్రశేఖర్, ప్రముఖ న్యాయవాది అబ్దుల్ రసూల్‌పై కూడా ఎన్ఐఏ అధికారులు కేసులు నమోదు చేయడం ఆందోళనకరంగా ఉందన్నారు. ఇలాంటి మేధావులు సమాజానికి ఎంతో అవసరమన్నారు. వారికి జరుగుతున్న అన్యాయాన్ని ఎండగట్టి, వారికి మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. అందు కోసమే మంగళవారం రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఎన్జీఓ హోమ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, పౌరసంఘాలు నాయకులు, కార్యకర్తలు పాల్గొని సంఘీభావం తెలిపాలని విజ్ఞప్తి చేశారు.

సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదు

ధైర్యం కోల్పోకుండా పోరాడాలి : ఎస్పీ



ప్రజాశక్తి-అనంతపురం క్రైం

ఏదైనా సమస్య వచ్చిందంటే దానికి పరిష్కారం కూడా వెన్నంటి ఉంటుందని ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్య వచ్చినప్పుడు ధైర్యం కోల్పోకుండా సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఆత్మహత్య అనేది సమస్యలకు పరిష్కారం కాదన్నారు. ఎవరికైనా ఎలాంటి సమస్యలున్నా ప్రభుత్వం, పోలీసు శాఖ దృష్టికి తీసుకొస్తే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వరం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. క్షణికావేశంలో అర్ధాంతరంగా తనువు చాలిస్తే కుటుంబాలు చిన్నాభిన్నమై భవిష్యత్తు అంధకారంలోకి వెళ్తుందనే విషయాన్ని గ్రహించాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో ఆత్మహత్య ఆలోచన దరిచేరనివ్వవద్దని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా విద్యార్థులు చదువుతున్న విద్యాసంస్థల్లో ఏవైనా ఇబ్బందులు ఎదుర్కొంటుంటే ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. ఎలాంటి సమస్యలు, ఇబ్బందులు ఉన్నా టోల్ ఫ్రీ నెంబర్లు 14416, 80089 14416, తన ఫోన్ నెంబర్ 94407 96800కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు. అంతేగాకుండా జిల్లా సర్వజన ఆస్పత్రిలో ప్రత్యేకంగా ఆత్మహత్యల నివారణ గురించి అవగాహన కల్పించేందుకు విభాగం (18వ నెంబర్ ఓపీ కౌంటర్) ఉందన్నారు. అక్కడికి నేరుగా వెళ్లడం లేదా పోలీసులను సంప్రదిస్తే ఆత్మహత్యను ఆపేవిధంగా చైతన్యం తీసుకొస్తారని తెలిపారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు



కమిషనర్ మల్లికార్జునకు వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలో పారిశుధ్యం మెరుగుపరిచి ప్రజలకు అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ వి.మల్లికార్జునకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ విస్తీర్ణంతోపాటు జనాభా పెరిగినా అందుకు అనుగుణంగా కార్మికుల సంఖ్య మాత్రం పెరగడం లేదన్నారు. అంతేగాకుండా రోజురోజుకూ కార్మికుల సంఖ్య తగ్గుతూ వస్తోందన్నారు. దీంతో పారిశుధ్యం పడకేసి దోమలు పెరిగి ప్రజలకు విషజ్వరాలు సంభవిస్తున్నాయన్నారు. టైఫాయిడ్, మలేరియా, డెంగీ వంటి విషజ్వరాలతో పెద్దలతో ఆసుపత్రుల పాలవుతున్నారన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందక ప్రాణభయంతో మెరుగైన వైద్యం కోసం ప్రయివేట్ ఆసుపత్రులకి వెళ్లి అప్పుల పాలవుతున్నారన్నారు. కావున అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి ప్రత్యేక శ్రద్ధతో పట్టణంలో దోమల నివారణ కోసం ఫాగింగ్, పిచికారి, బ్లీచింగ్ పౌడర్ వంటివాటిని చల్లాలని కోరారు. అదేవిధంగా స్పెషల్ డ్రైవ్ కింద మురికి కాలువలు, చెత్తాచెదారాలు, పిచ్చి మొక్కలను తొలగించి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు కసాపురం రమేష్, సాకే నాగరాజు, పట్టణ కమిటీ సభ్యులు చొక్కా సునీల్‌కుమార్, చంద్ర, తిమ్మప్ప, జాకీర్, అబ్దుల్లా, ఓబులేసు, నాయకులు వెంకీ, చెర్రీ, ప్రతాప్, సూరి, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ స్ప్రేయింగ్‌తో అధిక దిగుబడి



డ్రోన్ స్ప్రేయింగ్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

డ్రోన్ స్ప్రేయింగ్ ద్వారా రైతుకు అధిక దిగుబడి వచ్చి ఆదాయం పెరుగుతుందని పెద్దపల్లి సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ కిషోర్‌రెడ్డి తెలిపారు. సోమవారం తాడిపత్రి రూరల్ మండలం దిగువపల్లి గ్రామంలో రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో డ్రోన్ ద్వారా 15 ఎకరాల ఆముదం పంటలో స్ప్రేయింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న కాలంలో రైతులందరూ వ్యవసాయ యాంత్రీకరణను అవలంభించుకోవాలని సూచించారు. ఒక ఎకరాకు డ్రోన్ స్ప్రేయింగ్‌తో 10 లీటర్ల నీటిని మాత్రమే ఉపయోగించి పురుగులు తెగుళ్ల మందులను వాడవచ్చన్నారు. పురుగుమందు కూడా 25 శాతం తగ్గించి పది లీటర్లలో కలుపుకుని స్ప్రే చేయాలని సూచించారు. అనంతరం పత్తి పంటలో గులాబీ రంగు పురుగు యాజమాన్యంపై అవగాహన కల్పించారు. ప్రతి రైతూ పత్తి పంటలో ఫేరమోన్ ట్రాప్‌లు 15 నుంచి 20 చొప్పున ఒక ఎకరాకి పెట్టుకోవాలని తెలిపారు. పర్యావరణ రహిత యాజమాన్య పద్ధతులను రైతులందరూ తెలుసుకుని వారి పొలాల్లో అనుసరించాలని కోరారు.

గణేష్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

అధినేత మాస్టర్ విష్ణు

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక రామ్‌నగర్‌లోని గణేష్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మూడు నెలలపాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు అకాడమీ అధినేత మాస్టర్ విష్ణు తెలిపారు. ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 10 నుంచి 15వ తేదీ వరకూ అడ్మిషన్లు చేసుకుంటున్నట్లు తెలిపారు. 15 నుంచి క్లాసులు ప్రారంభమవుతాయన్నారు. సుదీర్ఘకాలంగా గణేష్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సామాన్య, పేదలకు ఉచితంగా డాన్స్ అందిస్తూ ప్రతిభకు సాను పెడుతున్నట్లు తెలిపారు. గణేష్ డాన్స్ అకాడమీలో శిక్షణ పొందిన ఎంతోమంది ప్రముఖ ఛానల్స్‌లో సినిమా రంగంలో రాణిస్తున్నట్లు తెలిపారు. రోజూ 6 నుంచి సాయంత్రం 8 గంటల వరకూ క్లాసులు ఉంటాయన్నారు. ప్రతి ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ స్పెషల్ క్లాసులు ఉంటాయన్నారు. డాన్స్ అకాడమీలో ఫోక్, బ్రేక్, వెస్ట్రన్, సెమి క్లాసికల్, సినీ డాన్సులు నేర్పిస్తున్నట్లు తెలిపారు. డాన్స్ శిక్షణకు వయస్సు నిమిత్తం లేకుండా క్రమశిక్షణ కొలబద్దగా అకాడమీలో శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. ఇదేక్రమంలో అనంతపురంలోని డాన్సర్లందరూ క్రమశిక్షణకు మారుపేరుగా ఏకతాటిపై సమిష్టిగా ఐకమత్యాన్ని పెంపొందించుకునేందుకు క్రమంలో డాన్స్ మాస్టర్ క్రికెట్ టోర్నమెంట్ అక్టోబర్ 29న నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతపురంలోని డాన్స్ శిక్షణ సంస్థల ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనున్నట్లు తెలిపారు. ఈ క్రికెట్ టోర్నమెంట్ వేదికగా పిటిసి మైదానాన్ని ఎంచుకున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు రామ్‌నగర్‌లోని గణేష్ డాన్స్ అకాడమీ సంస్థలోగానీ, సెల్..98495 63043, 75698 23053 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం : జనసేన

ప్రజాశక్తి-అనంతపురం



కార్యకర్తలకు ఆర్థికసాయం చెక్కు అందజేస్తున్న జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు టి.సి.వరుణ్

జనసేన క్రియాశీలక సభ్యత్వం తీసుకున్న ప్రతి జన సైనికునికి జనసేన పార్టీ అన్నివిధాలుగా అండగా ఉంటుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు టి.సి.వరుణ్ తెలిపారు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన బుక్కరాయసముద్రం మండలం నీలారెడ్డిపల్లి గ్రామానికి చెందిన బార్ ఆదెప్ప కుటుంబానికి సోమవారం నగరంలోని జనసేన పార్టీ కార్యాలయంలో రూ.50వేల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన రోడ్డు రోడ్డు ప్రమాదంలో ఆదెప్పకు రెండు కాళ్లకూ గాయాలయ్యాయి. విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించిన జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ రూ.50వేలు ఆర్థికసాయం ప్రకటించినట్లు తెలిపారు. దీంతో బాధితుడికి మంజూరైన చెక్కును అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు పొదిలి బాబురావు, రాష్ట్ర ఇన్‌ఛార్జి సాకే పవన్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి సాకే మురళీకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు అంకే ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శులు పత్తి చంద్రశేఖర్, కుమ్మర నాగేంద్ర, జిల్లా కార్యదర్శులు కిరణ్‌కుమార్, లక్ష్మీ చంద్ర, జయమ్మ, ఆవుల విజయకుమార్, పురుషోత్తమ్‌రెడ్డి, ముప్పూరి కృష్ణ, కృష్ణమూర్తి, కార్యక్రమాల కమిటీ సభ్యులు సంతోష్‌కుమార్, నార్పల మండల కన్వీనర్ రామకృష్ణ, బుక్కరాయసముద్రం మండల కన్వీనర్ ఎర్రిస్వామి, నాయకులు లోకేష్, శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేదల పట్టాలను రద్దుచేస్తే ఉద్యమిస్తాం

టిడిపి, సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన

ప్రజాశక్తి-ఉరవకొండ

విడపనకల్లు మండల కేంద్రంలో పేదలకు మంజూరు చేసిన ఇళ్ల పట్టాలను రద్దు చేస్తే ఉద్యమిస్తామని టిడిపి, సిపిఐ నాయకులు హెచ్చరించారు. ఈమేరకు సోమవారం విడపనకల్లు తహశీల్దార్ కార్యాలయం ముందు లబ్ధిదారులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగేళ్ల క్రితం మండల కేంద్రంలోని ఆర్.కొట్టాలకు వెళ్లే రహదారిలో 460 మంది పేదలకు సర్వేనెంబర్ 532, 530 సీలో పేదలకు పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. అయితే ప్రస్తుతం వాటిని ఇప్పుడు రద్దు చేస్తామని లబ్ధిదారులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలుపాలని నోటీసులు జారీ చేయడం బాధాకరమన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన పట్టాలను ఎందుకు రద్దు చేస్తారో పేదలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో ఇచ్చిన పట్టాలను యథావిధిగా కొనసాగించి హద్దులు ఏర్పాటు చేసి లబ్ధిదారుల ఇంటి నిర్మాణానికి సహకరించాలని కోరారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి చంద్రశేఖర్, టిడిపి నాయకులు హనుమంతు, సినిమా రామాంజనేయులుతోపాటు లబ్ధిదారులు పాల్గొన్నారు.

కొండాపురంలో పశు వైద్యశిబిరం

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని డి.కొండాపురం గ్రామంలో సోమవారం రాయదుర్గం వాటర్ షెడ్ సొసైటీల్యంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. పశు సంవర్ధక శాఖ ఉరవకొండ ఉప సంచా లకులు డాక్టర్ వెంకటేష్ మాట్లాడుతూ పాడి పశువుల యాజమాన్యంలో ఏడాదికి ఒక దూడ రావాలంటే ఖచ్చి తంగా యాజమాన్య పద్ధతులు పశువు పునరుత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించేలా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యులు డాక్టర్ శిరీష, బెళుగుప్ప పశు వైద్యులు డాక్టర్ రమేష్, వాటర్‌షెడ్ ఓఇ శ్రీధర్, వెల్ఫేర్ ఆఫీసర్ ఈరన్న, విశ్వేశ్వర, పశుసంవర్ధక శాఖ సహాయకులు, గోపాలమిత్రలు, పశువ్యాధి నిర్ధారణ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

కుందుర్పి : మండల అభివృద్ధికి ప్రతి అధికారి అంకితభావంతో పని చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపిడిఒ వెంకటనాయుడు హెచ్చరించారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై సోమవారం ప్రత్యేక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఎంపిడిఒ మాట్లాడుతూ 2023-24కి సంబంధించి అన్ని గ్రామీణ పంచాయతీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, తదితర సమస్యలపై అధికారులు పూర్తి స్థాయిలో నివేదికలు తీసుకొచ్చి ఆన్‌లైన్‌లో పొందుపరిచేలా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో పంచాయతీరాజ్ అధికారి వరప్రసాద్, ఎపిఎం హుస్సేన్, ఎఇఒ పరంధామ, పంచాయతీ కార్యదర్శులు మహబూబ్‌బాషా, రామాంజనేయులు, హరీష్, బాబాఫక్రుద్దీన్, రాజేష్, నందిని పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీల సంఖ్య పెంచాలి

రాయదుర్గం : రాయదుర్గం మీదుగా ప్రయాణించే ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీల సంఖ్య పెంచాలని కోరుతూ సోమవారం అఖిల భారత యువజన సమాఖ్య(ఎఐవైఎఫ్) నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కొట్రెష్ రైల్వే స్టేషన్ మాస్టర్ హేమంత్ కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. వందే భారత్ రైలులో టికెట్టు ధరలను తగ్గించాలని కోరారు. రైల్వే ప్రయివేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలి, ఖాళీ ఉద్యోగాలు భర్తీ చేయాలి, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నాయకులు వివేక్, తేజ, దినకర్, రవి పాల్గొన్నారు.

11న వాహనాల వేలం

గుత్తి : వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలను ఈనెల 11వతేదీన వేలం వేయనున్నట్లు సీఐ ఎం.వెంకటరామిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో వాహనాలకు బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు వేలంపాటలో పాల్గొనాలని కోరారు.

పెంచిన విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలి

వామపక్ష నాయకుల డిమాండ్

ప్రజాశక్తి-ఉరవకొండ

ప్రజలు నడ్డి విరిచే విధంగా ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం, సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం పట్టణంలో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం జగన్ ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే ఎట్టి పరిస్థితుల్లో విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెప్పడంతోపాటు 200 యూనిట్లు వరకూ ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దాదాపు ఏడుసార్లు విద్యుత్ ఛార్జీలను పెంచారన్నారు. అంతేగాకుండా వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించే ప్రయత్నం చేస్తూ ఉచిత విద్యుత్‌కు మంగళం పాడేందుకు పూనుకున్నాడని విమర్శించారు. వెంటనే రైతులకు ఉరితాళ్లలా మారనున్న వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు బిగింపును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ వంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రంగారెడ్డి, సిపిఐ తాలూకా ప్రధాన కార్యదర్శి జె.మల్లికార్జున, మండల కార్యదర్శి తలారి మల్లికార్జున, వజ్రకరూరు కార్యదర్శి సుల్తాన్, మహిళా నాయకురాలు వన్నూరమ్మ, రైతులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంతో జీవిద్దాం

మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్ - నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

ప్రజాశక్తి-అనంతపురం



అత్యంత ప్రామాణిక విలువలతో కూడిన శారీరక, మానసిక ఆరోగ్యంతో ఆనందంగా జీవించడం ప్రతి వ్యక్తి మానవ హక్కు అని మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజాశక్తితో మాట్లాడుతూ స్వేచ్ఛ, ఆత్మగౌరవం, హక్కుల కోసం ఐక్యరాజ్యసమితి, ప్రపంచ ఆరోగ్య సంస్థ, ప్రపంచ మానసిక ఆరోగ్య సమాఖ్య, ప్రభుత్వాలు, మానసిక ఆరోగ్య కేంద్రాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు ఎంతో కృషి చేస్తున్నాయన్నారు. అయినా మానసిక వ్యాధులతో బాధపడే వారి పట్ల వివక్ష, న్యూనతా భావన, చులకన ధోరణి, అవమానకర హేళన, హింసాత్మక ప్రవర్తన, సామాజిక కళంకం కొనసాగుతుండటం బాధాకరమన్నారు. ఫలితంగా మానసిక అనారోగ్యంతో బాధపడే వారు సామాజిక, కుటుంబ వ్యవహారాల్లో ప్రాధాన్యతకు నోచుకోవడం లేదన్నారు. ఈనేపథ్యంలో మానసిక వ్యాధితో బాధపడే వారు గౌరవప్రదంగా ప్రవర్తించాల్సిన బాధ్యతను తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా మానసిక ఆరోగ్యానికి భంగం వాటిల్లకుండా ప్రవర్తించాల్సిన ఆవశ్యకతను సార్వత్రిక మానవ హక్కుగా గుర్తించాలని, మానసిక సమస్యలున్న వారికి ఆర్థికంగా అందుబాటులో ప్రామాణికమైన చికిత్స, సంరక్షణ పొందడానికి అవకాశం ఉండాలని, స్వేచ్ఛగా, ఆత్మగౌరవంతో ఎంచుకునే అవకాశం హక్కుగా అందరికీ ఉండాలని సూచించారు. ఆయా సౌకర్యాలు లేక చాలామంది మానసిక రోజులు మద్యం, మాదక ద్రవ్యాలకు అలవాటు పడుతున్నారన్నారు. కావున పలు సంస్థలు, సామాజిక కార్యకర్తలు, వైద్యులు యుద్ధ ప్రాతిపదికను ప్రజల్లో అవగాహన కలిగించి అందుబాటులో ఉన్న అత్యాధునిక మానసిక వైద్యాన్ని సాధారణ వైద్యంతోపాటు అన్ని ఆసుపత్రుల్లో ఉచితంగా అందించేందుకు కృషి చేయాలని కోరారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-గార్లదిన్నె



గార్లదిన్నెలో రోగులకు మెడికల్ కిట్లు అందజేస్తున్న వైద్యులు

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ ఉషారాణి కోరారు. సోమవారం మండల పరిధిలోని కల్లూరు-3 సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష పథకంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులకు వివిధ రోగాలకు సంబంధించి పరీక్షలు నిర్వహించారు. అనంతరం మెడిసిన్ కిట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ విజయభాస్కర్, వైద్యాధికారి షమీంతాజ్, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండల పరిధిలోని ఎస్.గూడూరు గ్రామంలో చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి భ్రమరాంబ దేవి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పేదలకు అందజేస్తున్న వైద్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ యోగానందరెడ్డి, తహశీల్దార్ మోహన్‌కుమార్, వైద్యాధికారి శ్రీవాణి, వివిధ శాఖల అధికారులు, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, వాలంటరీలు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : మండలంలోని పసులూరు గ్రామంలో చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి భ్రమరాంబ దేవి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కంటి పరీక్ష కేంద్రాన్ని, ఫార్మసీ, ల్యాబ్, ఆరోగ్యశ్రీ రిఫరల్స్, కేస్ షీట్ డౌన్‌లోడ్ విభాగంతోపాటు స్పాట్ రిజిస్ట్రేషన్ రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ జి.నారాయణస్వామి ఎన్‌సిడి సిడి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు కళ్యాణ్‌కుమార్, భగీరత్, లక్ష్మీ సంధ్య, సౌజన్య, మండల స్పెషల్ ఆఫీసర్ ప్రభాకర్‌రెడ్డి, తహశీల్దార్ బి.లక్ష్మీనాయక్, మండల అభివృద్ధి శాఖధికారి బి.రామకృష్ణ ఆరోగ్య, సచివాలయం, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్వారీలు, టపాసుల గోదాముల్లో తనిఖీలు

ప్రజాశక్తి-అనంతపురం క్రైం



టపాసుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా వివిధ పోలీసుస్టేషన్ల పరిధిలోని క్వారీలు, టపాసుల గోదాముల్లో పోలీసులు సోమవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. పేలుడు పదార్థాలను నిలువ ఉంచే గోడౌన్లలోని మేగజైన్ లను, సంబంధిత రికార్డులను పరిశీలించారు. నిబంధనల మేరకు మైనింగ్ చేయాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడైనా అనధికారికంగా క్వారీలు నిర్వహిస్తున్నా, పేలుడు పదార్థాలు అక్రమంగా నిల్వ చేసినా తన ఫోన్ నెం.94407 96800కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. వెంటనే చర్యలు తీసుకోవడంతో పాటు సమాచారం పంపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

సెబ్ పోలీసుల దాడులు

ఎస్పీ ఆదేశాల మేరకు సెబ్ విభాగం పోలీసులు నాటుసారా స్థావరంపై దాడులు నిర్వహించారు. సెబ్ అదనపు ఎస్పీ జి.రామకృష్ణ పర్యవేక్షణలో జిల్లా ఇంటెలిజెన్స్ టీం అధికారులు బెలుగుప్ప శివార్లలోని నాటుసారా స్థావరంపై దాడి చేశారు. ఈ సందర్భంగా నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన దాదాపు 500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి కేసు నమోదు చేశారు.

ఇకెవైసిని పూర్తి చేయాలి

అనంతపురం : పీఎం కిసాన్ కోసం రైతుల నుంచి వందశాతం ఇకెవైసిని పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేయాలని ఎడిఎ ఎం.రవి సూచించారు. సోమవారం కూడేరు మండలంలోని ముదిరింపుకొండ రైతు భరోసా కేంద్రం పరిధిలో చేపట్టిన రైతుల ఇకెవైసిని అనంతపురం వ్యవసాయ డివిజన్ ఏడీఏ ఎం.రవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి రైతూ తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ పథకాలు రైతులకు చేరవేయడంలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కూడేరు మండల వ్యవసాయ అధికారి విజయకుమార్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

'డయల్ యువర్ డిఎం'కు 5 వినతులు

రాయదుర్గం : స్థానిక ఆర్టీసీ డిపోలో సోమవారం నిర్వహించిన 'డయల్ యువర్ డిఎం' కార్యక్రమంలో ప్రయాణికుల నుంచి 5 వినతులు అందినట్లు మేనేజర్ సురేష్‌కుమార్ తెలిపారు. అందులో రాయదుర్గం నుంచి చెళ్లికెర మీదుగా బెంగళూరుకు, చిత్రదుర్గంకు రెండు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు, రాయదుర్గం నుంచి బళ్లారికి సరసమైన ఛార్జీలతో సింగల్ స్టాప్ లేదా నాన్ స్టాప్ బస్సు సర్వీసు, రాయదుర్గం నుంచి మల్లాపురం, పల్లేపల్లి, మెచ్చిరి మీదుగా బళ్లారికి పల్లె వెలుగు సర్వీసు, రాయదుర్గం నుంచి గొడిసెలపల్లి మీదుగా బళ్లారికి బస్సు సర్వీసు, బడికి వెళ్లే విద్యార్థులకు అనువైన వేళలో లాల్‌బహదూర్‌నగర్-ఉద్దేహాల్ బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలని ప్రజలు, ప్రయాణికులు ఫోన్ ద్వారా కోరినట్లు తెలిపారు. లాల్ బహదూర్ నగర్-ఉద్దేహాల్ మధ్య కళ్యాణదుర్గం డిపో బస్సు సర్వీసులు తిరుగుతున్నాయని, ఆ డిపో మేనేజర్‌తో మాట్లాడి విద్యార్థుల బడి వేళలకు అనుగుణంగా బస్సు సర్వీస్ నడిపించేందుకు కృషి చేస్తామన్నారు. మిగిలినవి అంతర్రాష్ట్ర బస్సు సర్వీసులు అయినందున కర్నాటక రాష్ట్ర రవాణా అధికారులతో చర్చించి బస్సు సర్వీసులు నడిపేందుకు కృషి చేస్తామన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ఆత్మకూరు : మండలం పరిధిలోని తలుపూరు గ్రామానికి శివయ్య (55) ఇంటిపైన విద్యుత్ వైర్లు మరమ్మతులు చేస్తుండగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. హుటాహుటిన కుటుంబ సభ్యులు శివయ్యను అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. శివయ్య ఆర్‌అండ్‌బిలో ఒప్పంద కార్మికుడిగా పని చేస్తున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.జనార్ధన తెలిపారు.

ఎద్దుల బండి పైనుంచి పడి యువకుడి మృతి

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని వడ్రవన్నూరు గ్రామానికి చెందిన తిప్పేశి(18) సోమవారం ఎద్దుల బండి పై నుంచి కంది పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. ఎద్దుల బండిని తోలుకుంటూ వెళ్తుండగా ఉన్నఫలంగా ఎద్దులు వేగంగా పోవడంతో నిలబడి ఉన్న తిప్పేశి కింద పడడంతో మీదుగా చక్రాలు వెళ్లడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబ సభ్యులు రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

పెయింటర్‌కు గాయాలు

గుత్తి : పట్టణానికి చెందిన ఓ పెయింటర్ ఓ ఇంటికి రంగులు వేస్తుండగా సోమవారం ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. వేణుగోపాల్ పట్టణంలోని బీసీ కాలనీలోని ఇంటికి పెయింట్ వేస్తుండగా కింద పడటంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గాయపడ్డ అతన్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

తప్పుడు కేసులపై పోలీస్‌స్టేషన్లోనే తేల్చుకుంటా : కాలవ

రాయదుర్గం : తనతో పాటు తెలుగుతమ్ముళ్లపై పోలీసులు బనాయించిన అక్రమ కేసులపై మంగళవారం రాయదుర్గం పోలీస్ స్టేషన్ వద్దే తేల్చుకుంటానని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు ప్రకటించా రు. రాయదుర్గంలో వైసిపి శ్రేణులకు ఓ న్యాయం, టిడిపి వారికి మరొక న్యాయమా అని ప్రశ్నిస్తూ సోమవారం కాలవ ఓ వీడియో ప్రకటన విడుదల చేశారు రాయదుర్గంలో పోలీసులు స్వేచ్ఛను హరిస్తున్నారని, టిడిపి కార్యక్ర మాలకు పోలీసులు అడుగడుగునా అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. పది రోజుల్లో తనపైనా, తన అనుచరుల పైనా 5 కేసులు నమోదు చేసిన పోలీసులు, వైసిపి కార్యకర్తలు తనపై ప్రాణహాని కలిగించేలా ప్రకటనలు చేసినా ఇంతవరకు కేసు పెట్టలేదన్నారు. ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డికి పోలీసుల ఆంక్షలు వర్తించవా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు న్యాయం జరిగేంత వరకూ పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయిస్తానని హెచ్చరించారు.

అనంతలో కాలవ గృహనిర్బంధం

కాలవ శ్రీనివాసులును పోలీసులు గృహ నిర్బంధం చేశారు. అనంతపురంలోని ఆయన గహం వద్ద సోమవారం రాత్రి పోలీసులు వెళ్లి బయటకు వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కాలవ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. తనపై నమోదయిన అక్రమ కేసుల గురించి తెలుసుకునేందుకు పోలీసు స్టేషన్‌కు వెళ్తుంటే ఇలా గృహ నిర్బంధం చేయడం ఏమిటంటూ ఆయన పోలీసుల తీరును తప్పుబట్టారు.

'కాలవ'.. సెల్ఫీ డబ్బాలు తగవు : వైసిపి

రాయదుర్గం : ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి వేయించిన రోడ్లను తాను వేయించినట్లు చెప్పుకోవడం, అలాగే కాపు చేయించిన పనులను తాను చేయించినట్లు డబ్బా సెల్ఫీలు పెట్టడం కాలవ శ్రీనివాసులుకు పరిపాటైందని వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మాధవరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. టిడిపి నాయకులు అబద్ధాలు చెప్పి మభ్య పెట్టడం, మోసం చేయడంలో రాటుదేలిపోయారన్నారు. అబద్ధపు సెల్ఫీలతో ఎంతకాలం మోసం చేస్తారు. ఎవరు ఏ పనులు చేయించింది ప్రజలకు తెలియదా? మీ రాజకీయాలకు ఇక కాలం చెల్లింది, మీ మోసాలు, అబద్ధాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఎన్నో రకాల దోపిడీ కేసుల్లో స్టేలు తెచ్చుకున్న చంద్రబాబు స్టేలు రద్దయితే శేష జీవితం అంతా జైలుకే సరిపోతుందన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

అనంతపురం : రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు అశోక్‌నగర్‌లోని శ్రీవిద్యానికేతన్ విద్యార్థులు ఎంపికైనట్లు కరస్పాండెంట్ కె.పుల్లారెడ్డి, టి.రామకృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ వై.రఘునాథరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14 విభాగంలో దేదీప్యసాయి, అండర్-17 విభాగంలో శ్రీనవతేజారెడ్డి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరి ఎంపికకకు కృషిచేసిన పిఇటి కేశవరెడ్డితో కలిసి విద్యార్థులను అభినందించారు

పెద్దవడుగూరు : జిల్లాస్థాయి పోటీలకు మండలంలోని చిత్రచేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు బి.మధుసూదన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-17 విభాగంలో సలీం, అండర్-14 విభాగంలో మంజునాథ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరు మన్యం జిల్లాలోని పార్వతీపురంలో జరిగే పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. అలాగే అండర్-14 బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో సురేంద్ర, మంజునాథ్, సూర్యవంశీ జిల్లాస్థాయిలో పాల్గొననున్నట్లు తెలిపారు. వీరు రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయ్యేందుకు కృషి చేసిన పీఈటీ బాషాను అభినందించారు.

విత్తన పప్పుశనగ పంపిణీ

ఆత్మకూరు : మండల కేంద్రంలోని ఆత్మకూరు రైతు భరోసా కేంద్రంలో సోమవారం విత్తన పప్పుశనగను పంపిణీ చేశారు. మండలానికి 200 క్వింటాళ్ల విత్తన పప్పుశనగ కేటాయించగా 40 శాతం సబ్సిడీతో పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారిణి ఎఒ జి.సుచరిత తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ సుజిత, నీలిమ, ఆత్మకూరు సర్పంచి వరలక్ష్మి, అతికిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, వన్నూరుప్ప, విఎస్‌ఎ భాగ్యలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు ఆర్టీసీ బహుమతి

అనంతపురం : జిల్లాలోని నార్పల వైపు వెళ్లే పల్లె వెలుగు బస్సు సర్వీసుల్లో ప్రయాణించే ప్రయాణికులకు నెలకు మూడు బహుమతులు అందజేయనున్నట్లు డిపో మేనేజర్ నాగభూపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు బస్సు దిగి వెళ్లేటప్పుడు వారి టికెట్లు వెనుక ప్రయాణికుల పేరు, ఊరు, ఫోన్ నెంబర్ రాసి బస్సులో డ్రైవర్ సీటు వెనుక భాగంలో ఏర్పాటు చేసిన గిఫ్ట్ బాక్స్‌లో వేయాలని కోరారు. వీటిని ప్రతినెలా 17, 31వ తేదీల్లో లాటరీ తీసి మొదటి ముగ్గురికి బహుమతులు అందించనున్నట్లు తెలిపారు.

రాయదుర్గం : రాయదుర్గం-ఉరవకొండ రూట్‌లో రాయదుర్గం ఆర్టీసీ బస్సు సర్వీసులలో లక్కీ డ్రా పథకం అమలు చేస్తున్నట్లు డిపో మేనేజర్ కె.సురేష్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బస్సులో ప్రయాణించే ప్రయాణికులు బస్సు దిగినప్పుడు తమ టికెట్టు వెనుక పేరు, ఫోన్ నెంబర్ రాసి బస్సులో ఏర్పాటు చేసిన లక్కీ డ్రా గిఫ్ట్ బాక్స్‌లో వేయాలన్నారు. ప్రతినెలాఖరున లక్కీ డ్రా తీసి అందులో ఎంపిక చేసిన ముగ్గురు ప్రయాణికు లకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామన్నారు. ఉరవకొండ మార్గంలో వెళ్లే ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ తెలిపారు.

ఏఆర్ కానిస్టేబుళ్లకు ఉద్యోగోన్నతి

అనంతపురం క్రైం : జిల్లా ఏఆర్ విభాగంలో పని చేస్తున్న ఏఆర్ కానిస్టేబుళ్లు ఆదినారాయణ, శివశంకర్, కృష్ణమూర్తినాయుడుకు హెడ్ కానిస్టేబుళ్లుగా ఉద్యోగోన్నతి కల్పించారు. ఈమేరకు పదోన్నతి పొందిన కానిస్టేబుళ్లు ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఏఆర్ హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి కల్పించిన ఎస్పీకి, అదనపు ఎస్పీకి జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, సుధాకర్‌రెడ్డి, హరినాథ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు, ఏఆర్ డీఎస్పీ మునిరాజ్ ఉన్నారు.

మాజీమంత్రి 'కొల్లు'ను కలిసిన శింగనమల నాయకులు

శింగనమల : టిడిపి బిసి సెల్ రాష్ట్ర కన్వీనర్, మాజీమంత్రి కొల్లు రవీంద్రను సోమవారం జిల్లాలోని మరూరు టోల్‌గేట్ వద్ద శింగనమల బీసీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా బొకే అందజేశారు. మాజీమంత్రిని కలిసిన వారిలో టిడిపి నాయకులు కుళ్లాయప్ప, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి ఆదినారాయణ, బండి పరుశురాం, బెస్త నారాయణస్వామి, బెస్త అమర్నాథ్, దేరంగుల శంకరయ్య, మహమ్మద్‌గౌస్, తదితరులు ఉన్నారు.

న్యాయ వ్యవస్థపై అనుమానం కలిగేలా తీర్పులు..

మాజీ మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

చంద్రబాబు కేసుల విషయంలో కోర్టు తీర్పులు చూస్తుంటే న్యాయవ్యవస్థపై అనుమానాలు కలుగుతున్నాయని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. అనంతపురం నియోజకవర్గం కమిటీ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 27వ రోజుకు చేరుకున్నాయి. టిడిపి ఎస్సీ సెల్ విభాగం నాయకులు బంగి నాగ తదితరులు చేతులకు సంకెళ్లు వేసుకుని నిరసన తెలిపారు. దీక్షా శిబిరాన్ని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం అంటూ రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు ఆరోపణలతో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుని జైల్లో బంధించారని మండిపడ్డారు. నిరాధార ఆరోపణలతో 31 రోజుల పాటు జైలులో పెట్టడం రాజకీయ కక్షతో చేసినట్లు ఉందన్నారు. న్యాయవ్యవస్థలపై మాకు ఎంతో విశ్వాసం ఉందన్నారు. వీరి దీక్షలకు జనసేన పార్టీ నేతలు టిసి.వరుణ్, శ్రీలత, పత్తి చంద్రశేఖర్ తదితరులు హాజరై సంఘీభావం తెలిపారు.

రాయదుర్గం : సర్వోన్నత న్యాయస్థానంలో చంద్రబాబుకు న్యాయం దక్కుతుందని, వెంటనే బయటకు వస్తారని గట్టిగా విశ్వసిస్తున్నట్లు టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని టిడిపి కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన ముస్లిం మైనార్టీల రిలే దీక్ష శిబిరంలో సోమవారం కాలవ ప్రసంగించారు. చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ అన్ని వర్గాల ప్రజలు వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు నాగరాజు, మండల కన్వీనర్లు హనుమంతరెడ్డి, లాలెప్ప, గిరిమల్లప్ప, హనుమంతు, కడ్డిపూడి మహబూబ్‌బాషా, గౌస్, సాలర్ బాషా, జమీల్‌ఖాన్, ఉస్మాన్, జిలాన్, ఇనాయత్‌బాషా, జావీద్, ఖలందర్, సనావుల్లా, చాంద్, మాబూ, ఇస్మాయిల్, షమీ, వెంకటేశులు, వార్డు సభ్యురాలు ప్రశాంతి, భారతి, పురుషోత్తం, సుమలత, వాజిద్, హమీద్, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : సైకోలా వ్యవహరిస్తున్న జగన్ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్రగౌడ్ తెలిపారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ సోమవారం మండలంలోని యంగన్నపల్లిలో టిడిపి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షల్లో సర్పంచి పి.భరత్‌కుమార్, ఎంపిటిసి ఎం.ధనుంజయ, వడ్డే శ్రీనివాసులు, మాజీ సర్పంచులు కె.నాగన్నచౌదరి, ఎం.సుధాకర్‌నాయుడు, నాయకులు పి.నారాయణస్వామి, కె.శ్రీనివాసులు, లక్ష్మయ్య, కిష్టప్ప, మధు, వెంకటరామయ్య, పరమేష్ వెంకయ్య, అన్నయ్య, శంకర్‌గౌడ్ కూర్చొన్నారు. వీరికి మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ పూలమాలలు, కండువాలు వేసి సంఘీభావం తెలిపారు. అనంతరం బాబుతో నేను అనే కార్యక్రమంలో భాగంగా ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల, పట్టణ కన్వీనర్లు బర్దివలి, రవిశంకర్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌చౌదరి, టౌన్ బ్యాంక్ అధ్యక్షుడు అబ్దుల్ జిలాన్, మాజీ ఎంపీపీ వీరేష్, నాయకులు మోడే శ్రీనివాస్‌యాదవ్, దిల్కా శీనా, చిన్నరెడ్డియాదవ్, ఈరన్న, సుధీర్‌గౌడ్, రామరాజు, సాంబశివ, ఇలియాజ్, బోయగడ్డ రాముడు, సర్పంచి శ్రీరాములు, కేశప్ప, ప్రతాప్ పాల్గొన్నారు.



గుత్తిలో రిలే నిరాహార దీక్షలు చేస్తున్న టిడిపి నాయకులు



అనంతపురంలో మాట్లాడుతున్న మాజీమంత్రి కొల్లు రవీంద్ర

బెలుగుప్ప : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా మండల కేంద్రంలో సోమవారం బాబుకు తోడుగా కార్యక్రమంలో భాగంగా సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు తగ్గుపర్తి రాధాకృష్ణ, మల్లికార్జున, పెద్దతిప్పయ్య, వైస్ ఎంపీపీ తిమ్మప్ప, ఆవులెన్న సర్పంచి రామ్మోహన్‌చౌదరి, ఎర్రిస్వామి, వెంకటస్వామి, తిప్పేస్వామి, అంగడి శ్రీరాములు, బైనే నారాయణస్వామి, టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ మండల కేంద్రంలో టిడిపి నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం కూడా కొనసాగాయి. ఇందులో భాగంగా టిడిపి జిల్లా నాయకులు ఆలం వెంకటనరసానాయుడు అధ్యక్షతన సాష్టాంగ నమస్కారం చేస్తూ ప్లకార్డులు, నల్లబెలూన్లతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎర్రినాగప్ప, వెంకటనారాయణమ్మ, పిఎల్.లక్ష్మీనారాయణ, తలారి కుళ్లాయప్ప, రాజన్న, బొగ్గు నారాయణస్వామి, నాగభూషణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుట్లూరు : చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్.రాజు చేపట్టిన నిరవధిక నిరహార దీక్షకు పలువురు నాయకులు సోమవారం మద్దతు తెలిపారు. ఈ దీక్షలో టిడిపి నాయకులు గరికపాటి సుదర్శననాయుడు, కన్వీనర్ బాలరంగయ్య, శివశంకర, లక్ష్మయ్య, రవిచంద్ర, శ్రీనివాసులురెడ్డి, రామానాయుడు, చంద్ర, నారా రమేష్, తదితరులు పాల్గొన్నారు.